వదలపర్తి గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఏర్పడిన గుంతలు

# రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి సారూ..!

నాగిరెడ్డిపేట, మే 21: మండలంలోని వదలపర్తి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డుపై తారు పోయి గుంతలు పడి ప్రమాదకరంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 ఏండ్ల క్రితం రోడ్డు వేశారని తెలిపారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతుంటాయని, తారు, కంకర ధ్వంసం అయ్యిందని పేర్కొన్నారు. వర్షం కురిస్తే గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

## గ్రామాల్లో దివ్యాంగుల సర్వే

గాంధారి, మే 21: సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతోపాటు చుట్టు పక్కల గ్రామాల్లో రిసోర్సు టీచర్లు మంగళవారం దివ్యాంగుల సర్వేను చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ 18ఏండ్లలోపు ఉన్న దివ్యాంగుల వివరాల ను సేకరించారు. దివ్యాంగులను గుర్తించి వారికి రవాణా భత్యం, ఉపకరణా లు, సదరం సర్టిఫికెట్లు అందేలా చూడనున్నట్లు రిసోర్సు టీచర్లు తెలిపారు. కార్యక్రమంలో రిసోర్సు టీచర్లు పెంటయ్య, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

తిప్పారం తండాలో సర్వే నిర్వహిస్తున్న రిసోర్స్ టీచర్

# ప్రజలకు ఉపయోగపడే మొక్కలను పెంచాలి

- చేపల చెరువుల ఏర్పాటుపై రైతులకు అవగాహన కల్పించాలి
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవు
- కూలీలకు ఉపాధి పనులు కల్పించాలి
- డీఆర్డీవో చందర్‌నాయక్
- గ్రామాల్లో నర్సరీలు, ఉపాధి హామీ పనులను పరిశీలించిన అధికారి

సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో చందర్‌నాయక్

ఎల్లారెడ్డి, మే 21: గ్రామాల్లోని నర్సరీల్లో ప్రజలకు ఉపయోగపడే మొక్కలను పెంచాలని డీఆర్డీవో చందర్‌నాయక్ అన్నారు. ఎల్లారెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కమ్యూనిటీ ఫిష్‌పాండ్లు, ఉద్యాన పంటలు, పాంపాండ్ల ఏర్పాటు కోసం మండలంలో వంద ఎకరాల భూమిని గుర్తించాలన్నారు. వానకాలం ఆరంభంలో మొక్కల పంపిణీ, నాటడం ఉంటుందని అందరికీ ఉపయోగపడే మొక్కలను మాత్రమే నర్సరీల్లో పెంచాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాణి, ఏపీవో వినోద్ గౌడ్, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

***విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు..***

నాగిరెడ్డిపేట, మే 21: సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్డీవో చందర్‌నాయక్ హెచ్చరించారు. మండలంలోని వదల్‌పర్తి, మాల్తుమ్మెద గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆయన తనిఖీ చేశారు. కూలీలతో మాట్లాడారు. కూలీలకు తగిన వసతులు కల్పించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందితో సమీక్షను నిర్వహించారు. ఉపాధి పనులకు వంద శాతం కూలీలు హాజరయ్యేలా చూడాలన్నారు. మండలంలో చేపడుతున్న ఉపాధి పనులు, నర్సరీల వివరాలను ఏపీవో సాయిలును అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో పర్బన్న, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం నాగిరెడ్డిపేటలో మండల సమాఖ్య కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. యూనిఫామ్‌ల కోసం వచ్చే క్లాత్‌ను మండల సమాఖ్య సభ్యులకు అందజేసి, సకాలంలో దుస్తులు కుట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకు లింకేజీ రుణ లక్ష్యాన్ని పూర్తిచేయాలని సూచించారు. మండలానికి మొత్తం 24 చేపల యూనిట్లు మంజూరయ్యాయని, రైతులు చేపల చెరువులు ఏర్పాటు చేసుకునేలా చూడాలన్నారు. ఏపీఎం జగదీశ్, సీసీలు దత్తు, రమేశ్, నారాయణ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వదల్‌పర్తిలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న డీఆర్డీవో చందర్‌నాయక్

## పల్లె దవాఖాన కోసం స్థల పరిశీలన

బస్వాపూర్‌లో పల్లె దవాఖాన కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

భిక్కనూరు, మే 21 : మండలంలోని బస్వాపూర్ గ్రామంలో పల్లె దవాఖానను నిర్మించేందుకు స్థలాన్ని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె దవాఖానకు అనువైన స్థలాన్ని గుర్తించినట్లు తెలిపారు. బస్వాపూర్ గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.20 లక్షల తో పల్లె దవాఖానను త్వరలో నిర్మించనున్నట్లు తెలిపారు. క్యాక్రమంలో పంచాయతీ కార్యదర్శి దయాకర్‌రెడ్డి, గ్రామస్తులు మల్లారెడ్డి, బాగారెడ్డి, సిద్దరాంలు, జీవన్, లోకేశ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

## 'కేబుల్ దొంగలను పట్టుకుంటాం'

దోమకొండ, మే 21 : త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఎస్సై గణేశ్ తెలిపారు. మండలంలోని వ్యవసాయ కేంద్రాల వద్ద ఇటీవల జరిగిన చోరీలకు సంబంధించి పలువురు ఫిర్యాదు చేయగా మంగళవారం దొంగతనాలు జరిగిన ప్రదేశాలను పరిశీలించారు. మండలంలోని గొట్టిముక్కుల గ్రామ శివారులో ముదాం శివశంకర్‌కు సంబంధించిన పొలం నుంచి బోరు మోటరు స్టార్టరు, కేబుల్‌ను, అదే గ్రామానికి చెందిన ముదాం పోశయ్యకు సంబంధించిన సింగిల్ ఫేస్ మోటరు, పోలబోయిన గంగాగౌడ్‌కు చెందిన ఉల్లిగడ్డను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా చోరీ జరిగిన స్థలాలను పరిశీలించిన ఎస్సై నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

మాచారెడ్డి, మే 21 : మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో ఉన్న శ్రీ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం స్వామి వారికి నవకలశ స్నపనం (ఉత్సవమూర్తులకు) తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకట్‌నారాయణ తెలిపారు. బుధవారం అష్టోత్తర శతఘటాభిషేకం, డోలోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీధర్‌రావు తెలిపారు.

## వాస్తు హోమం ప్రారంభం

భిక్కనూరు, మే 21 : భిక్కనూరు సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వాస్తు హోమం కార్యక్రమం ప్రారంభమైంది. హైకోర్టు న్యాయమూర్తి పెద్దబచ్చగారి రామ్‌రెడ్డి, కృష్ణ కుమారి దంపతుల సహకారంతో ఉడిపి నుంచి వచ్చిన వేద బ్రాహ్మణులతో, ఆగమన శాస్త్ర ప్రకారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో హోమం ప్రారంభించారు. ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, భిక్కనూరు మాజీ సర్పంచ్ తునికి వేణు, గ్రామ పెద్దలు నర్సింహారెడ్డి, లింబా ద్రి, నంద రమేశ్, సుదర్శన్, మల్లేశం, సత్యంరెడ్డి, కరణ్‌రెడ్డి, చంద్రారెడ్డి, ఆలయ ఈవో శ్రీధర్ పాల్గొన్నారు.

## నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

ఫత్లాపూర్‌లో కంపోస్ట్‌షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీవో మహబూబ్

బిచ్కుంద, మే 21: నర్సరీల్లో మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీవో మహబూబ్ అన్నారు. మండలంలోని దౌల్తాపూర్, కందర్‌పల్లి, ఫత్లాపూర్, హస్గుల్ గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. గ్రామాల్లోని నర్సరీ, పల్లె ప్రకృతివనం, కంపోస్ట్‌షెడ్డు, వైకుంఠధామాలను సందర్శించారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. మొక్కలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. ఎండ నుంచి మొక్కలను సంరక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. వైకుంఠధామాల్లో ఉన్న వసతులను పరిశీలించారు. హస్గుల్ గ్రామంలో కూలీలు చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు సంజు, కామప్ప, సర్ఫరాజ్, రమేశ్ తదితరులు ఉన్నారు.

## బోరు మోటరు ఏర్పాటు

ఎల్లారెడ్డి, మే 21: మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నెలకొన్న నీటి సమస్య తీరింది. గ్రామంలో నీటి సమస్య ఏర్పడడంతో గ్రామస్తులు, స్థానిక నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన వెంటనే బోరు వేయించారు. దానికి మోటరును బిగించడంతో నీటి సమస్య తీరింది. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటాపూర్‌లో బిగించిన బోరుమోటరు

## 108 రకాల మిఠాయిలతో కాలభైరవుడికి అలంకరణ

రామారెడ్డి, మే 21: మండలంలోని ఇసన్నపల్లి గ్రామంలో వెలసిన కాలభైరవ స్వామికి వైశాఖమాసం రెండో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. జలాభిషేకం, సిందూర, మహా పూజలను నిర్వహించారు. భక్తులు సమర్పించిన 108 రకాల తీపి పదార్థాలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. భజన కార్యక్రమాలు కొనసాగాయి. మల్లేశం, నిమ్మ వేణుగోపాల్‌రెడ్డి సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభురాంచంద్రం, సీనియర్ అసిస్టెంట్ సురేందర్, నాగరాజు, భరత్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తులు సన్మార్గంలో నడవాలి

నాగిరెడ్డిపేట, మే 21: భక్తులు సన్మార్గంలో నడవాలని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామీజీఅన్నారు. మంగళవారం నిర్వహించిన గోలిలింగాల స్వయంభు శివాలయ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని శివ లింగానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలు తాము సంపాదించిన దాంట్లో కొంత దానధర్మాలు చేయాలని సూచించారు. ఆశను వీడితేనే సంతోషం లభిస్తుందని స్వామీజీ తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తుల కోసం అన్నదానం ఏర్పాటుచేశారు.

## మట్టితో శివ లింగాల తయారీ

భిక్కనూరు, మే 21: కాశీలో నిర్వహించనున్న కోటి పార్థివ మహా శివలింగార్చన కోసం దేశవ్యాప్తంగా భక్తులు మట్టితో శివ లింగాలను తయారుచేస్తున్నారు. ఇందులో భాగంగా భిక్కనూరు మండల కేంద్రంలోని శ్రీ నగేశ్వరాలయంలో మూడు రోజులుగా మట్టితో శివలింగాలను మహిళలు తయారు చేస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చిన మట్టితో సుమారు రెండు లక్షల శివ లింగాలను తయారు చేయనున్నట్లు నిర్వాహకుడు చీకోటి ప్రభాకర్‌గుప్తా మంగళవారం తెలిపారు. ఆర్యవైశ్య యువజన సేవా సంఘం ఆధ్వర్యంలోని మహిళలు వీటిని తయారు చేస్తున్నారని పేర్కొన్నారు.

భిక్కనూరులో మట్టితో శివ లింగాలు తయారు చేస్తున్న మహిళలు

## పల్లె ప్రకృతివనంలో చెట్ల నరికివేత

సంతోష్‌నగర్ తండాలోని పల్లె ప్రకృతి వనంలో నరికేసిన చెట్లు

బాన్సువాడ రూరల్, మే 21 : బాన్సువాడ మండలంలోని కొత్తాబాది గ్రామ పంచాయతీ పరిధిలోని సంతోష్‌నగర్ తండాలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనంలో గ్రామానికి చెందిన చందర్ దాదాపు 30 చెట్లను నరికి వేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

గ్రామ పంచాయతీ కార్యదర్శి గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పల్లె ప్రకృతి వనంలో ఈ నెల 10న ఉదయం నాలుగు గంటలకు గ్రామానికి చెందిన చందర్ చెట్లను నరికి వేస్తుండగా, గ్రామస్తులు ఎందుకు నరుకుతున్నావని ప్రశ్నించగా, వారితో దురుసుగా వ్యవహరించినట్లు తెలిపారు. చెట్ల నరికివేతపై జరిమానా విధించి నోటీస్ అందించగా స్పందించలేదని తెలిపారు. ఈ విషయమై బాన్సువాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, కేసు నమోదు చేసుకొని పోలీసులు విచారిస్తున్నట్లు కార్యదర్శి తెలిపారు.

## మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలి

నస్రుల్లాబాద్, మే 21 : మండలంలోని అంకోల్ తండా గ్రామంలో నర్సరీని డీఎల్‌పీవో నాగరాజు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో మొక్కలను నాటేందుకు సిద్ధం చేయాలని అన్నారు. మొక్కలు ఎండిపోకుండా ప్రతిరోజూ నీటిని పోసి సంరక్షించాలని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. కంపోస్ట్ షెడ్డును పరిశీలించి కంపోస్ట్ ఎరువు తయారీకి సూచనలు చేశారు. గ్రామంలో చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీవో రాము, కార్యదర్శి ఉన్నారు.

అంకోల్ తండా గ్రామంలో నర్సరీని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, **RABANI**, **S/o.GOUSE MIYA**, H.No. 1-114, Dongli, (M) Madnoor, (D) Kamareddy Now changed my name as **SHAIK RABBANI S/o. SHAIK GOUSE MIYA**
NTZ-324682

**PASSPORT LOST**

I, **BODOLLA GOPAL S/o. BODALL PEDDA SAYANNA,** H.No.1-66, Vil: Jakora, Mdl: Varni, Dist. Nizamabad T.S. I Lost my original Passport No.**F6981683,** While travelling from Gupanpally to Kanteshwar on 14-05-2024. If any one found please contact: **97045 00601**

**WANTED**

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327722-All

**పాస్‌పోర్ట్ పోయినది**

GUGULOTH GANESH S/O. GUGULOTH VITTAL, H.No.6-20/1, DB Thanda, Dubbak, Mdl: Dharpally, Nizamabad, T.S. నా యొక్క Passport No. P8050205 కలలి DB Thanda నుండి Dubbak కు బైక్ పై వెళ్ళుతుండగా మార్గమధ్యలో పోయినది. ఎవరికైన దొరికినచో సంప్రదించు సెల్: 83097 54822

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

విత్తనాలను పంపిణీ చేస్తున్న నాయకులు

బాన్సువాడ టౌన్, మే 21 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చాలీచాలని విత్తనాలు, ఎరువులను విడుదల చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నదని బాన్సువాడ సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. బాన్సువాడ సొసైటీలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక బస్తా రూ. 1,116 ఉంటుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు మేలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల నడ్డి విరిచేలా ప్రవర్తిస్తున్నదని అన్నారు. బాన్సువాడ పీఏసీఎస్ పరిధిలో కేవలం 166 బస్తాల జీలుగ విత్తనాలు మాత్రమే వచ్చాయన్నారు. మే నెల పూర్తి కావస్తున్నా ఇప్పటి వరకు రైతులకు సరిపడా విత్తనాలు రాలేదన్నారు. ఇంత వరకు జిల్లా పరిధిలో పూర్తిగా ధాన్యం కాంటలు కాలేవని చెప్పారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, సొసైటీ కార్యదర్శి నారాయణ రెడ్డి, సొసైటీ సిబ్బంది, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## అ'పూర్వ' సమ్మేళనం

బాన్సువాడ రూరల్, మే 21 : మండలంలోని తాడ్కోల్ రెడ్డి కల్యాణ మండపంలో బాన్సువాడ పట్టణంలోని సాయికీర్తి జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ (2001 – 2003 బ్యాచ్) ఆర్ట్స్ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 21 ఏండ్ల తర్వాత కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. యోగక్షేమాలు తెలుసుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం కళాశాలలో బోధించిన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు వేణు, చిదుర వినయ్, రుద్రంగి మురళి, హన్మాండ్లు, రమేశ్, అరవింద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

## పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

దోమకొండ, మే 21 : మండల కేంద్రానికి చెందిన ఏర్ర నరేందర్ మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై గణేశ్ సీఈఐఆర్ యాప్ ద్వారా సెల్‌ఫోన్ ట్రేస్ చేసి స్వాధీనం చేసుకొని బాధితుడికి పోలీస్ స్టేషన్‌లో అందజేశారు.

## భిక్కనూరు విద్యార్థినికి ఐఐటీ పట్టా

ఐఐటీ పట్టా పొందిన భిక్కనూరు విద్యార్థిని గజ్జెల శ్రీలేఖ

భిక్కనూరు, మే 21: భిక్కనూరుకు చెందిన గజ్జెల శ్రీలేఖ ఐఐటీ పట్టాను అందుకున్నది. 2019బ్యాచ్‌నకు చెందిన శ్రీలేఖ జేఈఈ మెయిన్స్‌లో మంచి ర్యాంక్ పొంది పాట్నా ఐఐటీలో సీటు సాధించింది. కంప్యూటర్ సైన్స్ విభాగంలో విద్యను పూర్తిచేసింది. ఇటీవల నిర్వహించిన ఐఐటీ పాట్నా స్నాతకోత్సవంలో పట్టాను అందుకున్నది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐఐటీ పాట్నా నుంచి పట్టా పొందడం సంతోషంగా ఉన్నదన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆమెను అభినందించారు.